క్లుప్తంగా

బూడి ముత్యాలనాయుడుకు అభినందన



ముత్యాలనాయుడును సత్కరిస్తున్న సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడిగా నిమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బూడి స్వగ్రామం తారువలో కలిసి, పుష్పగుచ్ఛం, వేంకటేశ్వరస్వామి చిత్రపటం అందించి అభినందన సత్కారం చేశారు. బూడిని కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె నాయుడు, ఉగ్గిన అప్పారావు, పల్లెల సాయికిరణ్, నాయుడు, బండారు శ్రావణి, ప్రభాకర్, పిల్ల నరసింహరాజు, బోడ్డేటి లక్ష్మీనారాయణ, చీడికాడ మండల నేత స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



రాధాకృష్ణను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పరవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త రాధాకృష్ణ శుక్రవారం కాలు జారి పడిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈయన కాలికి అయిన గాయానికి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పైల హరీష్, వర్రి హరిబు శుక్రవారం పరామర్శించారు. ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న సి.కె.బాబు

పెందుర్తి: లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తరువాత దాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిస్తేనే ఫలితం దక్కుతుందని ప్రముఖ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ నిపుణుడు సి.కె.బాబు అన్నారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కంట్రోల్, ఎక్స్‌పెక్టేషన్స్, కంపేర్(సీఈసీ) గురించి వివరించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పలు భక్తి గీతాలకు విద్యార్థినులు తమదైన శైలిలో నృత్యాలు చేశారు. దేవస్థానం తరఫున ఈవో వి.త్రినాథరావు బాలలకు స్వామివారి ప్రసాదాన్ని, ఉపాధ్యాయులకు శేషవస్త్రాలను అందించారు. దేవస్థానం ఏఈవో ఆనంద్ కుమార్, వీబీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు సూచనలిస్తున్న జీసీడీవో

పెందుర్తి: పీఎం శ్రీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక కార్ షోరూంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా జీసీడీవో కలిశా బేగం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. హెచ్ఎం చిన్నమ్మాయి, సిబ్బంది పాల్గొన్నారు.



పెచ్చులూడిన దలాయిపాలెం తుపాను షెల్టర్ శ్లాబ్

ఆలస్యం చేస్తే..
బతుకులు 'శిథిలం'

తుపాను షెల్టర్లు.. ప్రకృతి విపత్తులు తలెత్తినపుడు లోతట్టు ప్రాంత ప్రజల రక్షణ కోసం నిర్మించిన భవనాలు. ఇప్పుడు ఆ భవనాలే స్థానికుల్ని భయపెడుతున్నాయి. భారీ వర్షాల సమయంలో ధైర్యాన్నిచ్చే తుపాను షెల్టర్లు.. చిన్న చినుకులకూ భయపడాల్సిన పరిస్థితిని తెచ్చిపెట్టాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారాయి. వీటిని కూల్చివేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.

- శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్లు
- భయంభయంగా బతుకుతున్న స్థానికులు
- కూల్చివేతలకు అధికారుల మీనమేషాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన వైనం

పరవాడ: విపత్తుల సమయంలో లోతట్టు గ్రామాల ప్రజల రక్షణార్థం నాలుగు దశాబ్దాల క్రితం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన తుపాను షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. మండలంలోని వాడచీపురుపల్లి, దలాయిపాలెం, వెంకటపతిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన షెల్టర్ల ఆలనాపాలనా చూసే నాథుడు లేక, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారడంతో వర్షాలకు నానిపోయి, శ్లాబులు, గచ్చులు, గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఎప్పుడో ఊడిపోయాయి. వర్షాలు పడే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు భయం భయంగా బతుకుతున్నారు. కొత్త భవనాల నిర్మాణం దేవుడెరుక.. ఈ శిథిల భవనాలను తొలగించి, ప్రమాదాల్ని నివారించాల్సిందిగా స్థానికులు వేడుకుంటున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్నా..



కూలడానికి సిద్ధంగా ఉన్న వెంకటపతిపాలెం తుపాను భవనం

వెంకటపతిపాలెంలో ఏర్పాటు చేసిన రెండంతస్తుల విపత్తుల భవనంలో చాలా కాలం ప్రభుత్వ వసతిగృహాన్ని నిర్వహించారు. ఆ తరువాత అధికారులు భవనం ఆలనాపాలనా గాలికి వదిలేశారు. దీంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబులు పెచ్చులూడుతున్నాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం.. రాత్రుళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అలాంటివారు భవనంలో ఉన్న సమయంలో శ్లాబ్ కూలితే పరిస్థితి దారుణంగా ఉంటుందని చెప్తున్నారు. రోడ్డు పక్కనున్న ఈ శిథిల భవనాన్ని వీలైనంత వేగంగా కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

చుట్టూ ఇళ్లు.. మధ్యలో శిథిల భవనం



శిథిలావస్థకు చేరిన వాడచీపురుపల్లి తుపాను షెల్టర్

వాడచీపురుపల్లిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన తుపాను షెల్టర్ కొన్నేళ్ల పాటు ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగపడింది. ఈ భవనంలోనే చాన్నాళ్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపారు. ఆ తర్వాత మరమ్మతులకు గురవడంతో వదిలేశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ బాగా దెబ్బతింది. పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. మెట్ల మార్గం పూర్తిగా కూలిపోయింది. భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితి. భవనం చుట్టూ ప్రజలు ఇళ్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారు. శిథిల భవనం ఎప్పుడు ఎవరి ఇళ్లపై కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దయనీయం.. దలాయిపాలెం షెల్టర్



నేడో రేపో కూలనున్న దలాయిపాలెం తుపాను భవనం

దలాయిపాలెంలో నిర్మించిన తుపాను షెల్టర్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. భవనం శ్లాబులు దెబ్బతిన్నాయి. గోడలకు పగుళ్లిచ్చాయి. భారీ వర్షాలు పడితే ఏ క్షణంలోనైనా కూలిపోతుందని స్థానికుల భయం. ఈ భవనం పక్కనే నివాసం ఉంటున్న ఓ కుటుంబం పరిస్థితి మరింత దయనీయం. రోడ్డు పక్కనున్న ఈ శిథిల భవనం రోడ్డు వైపు కూలిపోతే పర్లేదు. లేకుంటే తమ ప్రాణాలు కోల్పోక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల తుపాను భవనాన్ని ఎంత వేగంగా వీలైతే అంత వేగంగా తొలగించేందుకు అధికారులు చొరవ చూపాలని సమీపంలోని కుటుంబం కోరుతోంది.

క్షణక్షణం భయం భయం



వాడచీపురుపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనాన్ని ఆనుకుని కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. భవనానికి బీటలు వారి, గోడలు, శ్లాబ్ పగుళ్లు పడి ఏ క్షణాన్నైనా కూలిపోయేలా ఉంది. వర్షాలు కురిసే సమయంలో స్థానికులు భయపడుతున్నారు. కాలయాపన చేయకుండా ఈ భవనాన్ని తొలగించాలి.

– లాలం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ

శిథిల భవనాన్ని తొలగించాలి



దలాయిపాలెంలో నిర్మించిన తుపాను భవనం ఏ క్షణంలో కూలుతుందోనని భయపడుతున్నాం. ఈ శిథిల భవనం పక్కనే నివసిస్తున్న ఓ కుటుంబం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తోంది. భవనం ఏ క్షణంలో కూలిపోయి, ఎందరి ప్రాణాలు హరిస్తుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు తక్షణచర్యలు చేపట్టి, దీన్ని కూల్చివేయాలి.

– దలాయి నూకరాజు, దలాయిపాలెం

ఉన్నతాధికారులకు నివేదించాం



శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్ల తొలగింపు సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. కొన్ని భవనాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. పాడైన తుపాను రక్షిత భవనాలతో జరగనున్న ప్రమాదాన్ని అంచనా వేసి, తొలగింపునకయ్యే వ్యయ ప్రయాసల్ని అధికారులకు తెలియజేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకొంటాం.

– కె.రమేష్‌నాయుడు, ఈవోఆర్డీ, పరవాడ

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



డీటీ అప్పారావు



ఈవోపీఆర్డీ బి.చైతన్య



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్

సబ్బవరం: మండలంలో పలు శాఖల అధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా సబ్బవరం వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరం ఈవోపీఆర్డీగా బోండా చైతన్య చోడవరం నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె జీకే వీధి, చీడికాడ మండలాల్లో పనిచేశారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన ఒ.మహేష్ బదిలీపై చోడవరం వెళ్లారు.

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా డి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన అచ్యుతాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో గొలుగొండ, జి.మాడుగులలో పనిచేసినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేసిన హిమబిందు అనకాపల్లికి బదిలీపై వెళ్లారు.
- సబ్బవరం డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో నాతవరం, అచ్యుతాపురం, రోలుగుంట మండలాల్లో డీటీగా పనిచేశారు. సబ్బవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

పరవాడ ఈవోఆర్డీగా ధర్మారావు

పరవాడ: స్థానిక మండల పంచాయతీ విస్తరణాధికారిగా బి.ధర్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి ఈవోఆర్డీగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈవోఆర్డీగా పనిచేసిన కె.రమేష్‌నాయుడు భీమిలి బదిలీ అయ్యారు. మండలంలో పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ధర్మారావు తెలిపారు.

తుప్పలు తొలగించారు



తుప్పలు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: వాడచీపురుపల్లి–దలాయిపాలెం మధ్య ఏపుగా పెరిగిన తుప్పలను అధికారులు తొలగించారు. కంచె తుప్పలను తొలగించండి శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొక్లెయిన్ సాయంతో పిచ్చిమొక్కలు, తుప్పలను కూకటి వేళ్లతో సహా పెకిలించారు. దీంతో రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఎన్టీపీసీ, హిందూజా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

అధ్వానంగా పెదముషిడివాడ- ఈ మర్రిపాలెం రోడ్డు



పెదముషిడివాడ- ఈ మర్రిపాలెం రోడ్డు దుస్థితి

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ–ఈ మర్రిపాలెం గ్రామాల మధ్యనున్న మెటల్ రోడ్డు అధ్వానంగా మారడంతో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. పెదముషిడివాడ పరిసర ప్రాంతాల్లో రాత్రీ పగలు తేడా లేకుండా భారీ వాహనాలతో అక్రమ గ్రావెల్ తరలింపు చేపడుతున్న నేపథ్యంలో రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నడవడానికక్కూడా వీల్లేకుండా రోడ్డు తయారయింది. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో నీరు చేరి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ మర్రిపాలెం రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి–పోర్లుపాలెం రోడ్డు పునర్నిర్మాణ పనులకు కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ పనుల కారణంగా ఈ రోడ్డు దెబ్బతిందన్నారు. దీనికి మరమ్మతులు చేపట్టకుండా ప్రజలకు పూర్తి స్థాయిలో వినియోగపడేలా రోడ్డు పునర్నిర్మాణానికి జీవీఎంసీ నుంచి నిధులు రప్పించి, పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. త్వరితగతిన రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అయిత ఎర్రయ్య, నాయకులు ఆకుల గుణాకర్, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, సబ్బవరపు ప్రకాష్, మల్లువలస సూర్యనారాయణ, విరోతు విశ్వనాథం, బొట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీం.. సర్వతత్వాత్మకాం



ఎస్ఆర్ పురంలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



సుజాతనగర్లో బాలాత్రిపుర సుందరి అలంకరణలో కనకదుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో బాలాత్రిపుర సుందరిగా పంచముఖ గాయత్రీదేవి



పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు



సప్తగిరినగర్‌లో ధాన్యలక్ష్మిగా అలివేలు మంగమ్మ



దేవీపురంలో పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

- ధాన్యలక్ష్మి, బాలాత్రిపురసుందరి, గాయత్రి అలంకరణలో అమ్మవారు
- ఊరూవాడా అమ్మవారి శరణు ఘోష, అన్నసమారాధనలు

మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలను తన అధీనంలో ఉంచుకున్న శక్తి.. బాలా త్రిపుర సుందరీ దేవి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఊరూవాడా వెలసిన అమ్మవారి దేవాలయాల్లో దుర్గమ్మను కొన్ని చోట్ల బాలా త్రిపుర సుందరిగాను, మరికొన్ని చోట్ల గాయత్రి, ధాన్యలక్ష్మిగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఊరూవాడా అమ్మవారి నామస్మరణతో మార్మోగిపోయింది.

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తిలోని అమ్మవార్ల దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా అమ్మవారికి రుద్రాభిషేకం, అఖండ క్షీరాభిషేకాలు చేశారు. బాలాత్రిపుర సుందరిగా జగన్మాత దర్శనమిచ్చారు. బాలోపాసన అత్యంత వైభవంగా నిర్వహించారు.
- చినముషిడివాడ పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. ధాన్యలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.
- మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.
- ప్రశాంతినగర్‌లోని కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు. సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిపారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.



సాధూమఠం మహాకామేశ్వరి పీఠంలో 'బాలా' పూజలో చిన్నారులు

ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సహస్రాక్షి అమ్మవారి సన్నిధిలో ప్రతిష్ఠించిన కలశాలకు మండపారాధన, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, నూతన వస్త్ర అలంకరణ నిర్వహించారు. సాయంత్రం దేవీపురం అమృత కన్యా గురుకులం విద్యార్థినులు, వలంటీర్లు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి ఖడ్గమాల హోమం నిర్వహించారు.

సింహాచలం: అడవివరంలోని హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం గోపూజ నిర్వహించారు. ఉత్సవ ప్రాంగణంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించతలపెట్టిన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమపూజలు జరిపారు. ఫణిమనోహర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరవాడ: స్థానిక యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతబయలు వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 9 రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పంచముఖ గాయత్రి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మహేశ్వరీదేవిగా రాజశ్యామల



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని శారదాపీఠంలో శుక్రవారం మహేశ్వరీదేవిగా శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల చేతుల మీదుగా అమ్మవారికి పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమ పూజ, సువాసిని పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి స్వామీజీ చేతుల మీదుగా ఏకాదశ హారతులు అందించారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

పెందుర్తి: మండలంలోని గ్రామ వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వలంటీర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట్రావుకు వినతిపత్రం అందించారు.



మండల పరిషత్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ వలంటీర్లు